వర్తక సంఘం సభ్యులతో సీఐ సమావేశం

విశాలాంధ్ర-జి మాడుగుల : మండల కేంద్రంలో స్థానిక సీఐ రమేష్ బుధవారం వర్తక సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో వీధిలైట్లు తప్పనిసరిగా వెలగాలని, దీనికి పంచాయతీకి మీరు కొంత సహాయ సహకారాలు అందించి తోడ్పడాలని, అలాగే వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేస్తున్న సీసీ కెమెరాలను రికార్డు చేసేందుకుగాను అవసరమైనచోట్ల వీధిలైట్లు కూడా తప్పనిసరిగా ఉండాలని, వీధిలైట్లు లేనిచోట మీ షాపులు, ఇళ్ళముందు తప్పనిసరిగా లైట్లు వేసుకోవాలని, అవి నిరంతరం రాత్రి సమయంలో సమయంలో పనిచేయాలని వర్తక సంఘం సభ్యులకు సూచించారు. అలాగే మీగ్రామంలో అనుమానత వ్యక్తులు సంచరించినట్లు తెలిస్తే వెంటనే సమాచారం అందించాలని కోరారు. అలాగే రాత్రి సమయంలో అన్ని షాప్‌లు 9 గంటల దాటితే తెరిచి ఉంచరాదు. రాత్రి సమయంలో ఇష్టం వచ్చినట్లు రోడ్లపై తిరుగుతూ కాలయాపన చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాంబాబు పంచాయతీ సెక్రెటరీతో పాటు వర్తక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అరాచక పాలన అంతమే జనసేన లక్ష్యం

విశాలాంధ్ర-పాడేరు:రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న అరాచక పాలన నుండి ప్రజలను విముక్తులను చేయడమే జనసేన ప్రధాన లక్ష్యమన్నారు పాడేరు జనసేన ఇంచార్జ్ వంపూరి గంగులయ్య. బుధవారం పాడేరు జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన ఉమ్మడి కూటమి అభ్యర్థి కిల్లు వెంకటరమేష్ నాయుడుతో కలిసి ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ అరకు పార్లమెంట్ ఇంచార్జ్ డాక్టర్ వంపూరు గంగులయ్య మాట్లాడుతూ పాడేరులో ఉమ్మడి అభ్యర్థి విజయం తథ్యమన్నారు. త్వరలో కూటమి ఉమ్మడి సమావేశం వుంటుందని, ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికను అనుసరించి నియోజకవర్గ కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి నేత నందోలి ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలి

విశాలాంధ్ర-సీలేరు : ఎన్నికలు సజావుగా జరిగేలా అందరూ సహకరించాలని సీలేరు ఎస్సై రామకృష్ణ కోరారు. బుధవారం మండలంలోని గుమ్మిరేవుల, చెరుకుమల్లు గ్రామాల్లో పర్యటించి గ్రామస్థులతో మాట్లాడారు. యువత చెడు మార్గాల వైపు వెళ్లరాదన్నారు. పిల్లలకు పాఠశాలకు ఖచ్చితంగా పంపించాలన్నారు. ఎటువంటి సమస్య వచ్చినా పోలీసుశాఖ అండగా ఉంటుందని చెప్పారు.

150 కేజీల గంజాయి స్వాధీనం... ఒకరి అరెస్టు

చింతపల్లి సీఐ రమేష్ వెల్లడి

విశాలాంధ్ర-చింతపల్లి : ఒరిస్సా రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న 150 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని అందుకు బాధ్యుడైన వ్యక్తిని అరెస్టు చేయడం జరిగిందని స్థానిక సిఐ రమేష్ అన్నారు. ఎస్సై అరుణ్ కిరణ్ కలిసి బుధవారం ఆయన అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒరిస్సా రాష్ట్రం నుంచి అల్లూరి జిల్లా మీదుగా మైదాన ప్రాంతానికి తరలించేందుకు పది రోజుల క్రితమే 150 కిలోల గంజాయిని మండలంలోని కిటుముల పంచాయతీ చీమలపాడు గ్రామ శివార్లలో రహస్య ప్రదేశంలో దాచినట్లు తమకు అందిన పక్కా సమాచారంతో తమ సిబ్బందితో ఆ ప్రాంతాన్ని ముమ్మరంగా తనిఖీ చేపట్టి చెట్లు పొదల్లో దాచి ఉంచిన 150 కిలోల గంజాయి స్వాధీనం చేసుకోవడంతోపాటు, గంజాయి అక్రమంగా రవాణాకు పాల్పడుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడిన వ్యక్తి పై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో చాకచక్యంగా వ్యవహరించి గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసిన ఎస్సై అరుణ్ కిరణ్ ను, సిబ్బందిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

పొత్తుల దెబ్బతో మారిన తలరాతలు

వంతల సుబ్బారావుకు కాంగ్రెస్, గిడ్డి ఈశ్వరికి తెదేపా జలక్

విశాలాంధ్ర-చింతపల్లి : రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు పెట్టుకున్న పొత్తులు పాడేరు నియోజకవర్గంలో కాంగ్రెస్, తెదేపా పాడేరు నియోజకవర్గ ఇన్చార్జిల తలరాతలను మార్చేసింది. గడచిన ఐదేళ్లుగా వైకాపా వైఫల్యాలను ఎండగడుతూ ఆయా పార్టీలు నిర్దేశించిన కార్యక్రమాలను చిత్తశుద్ధితో నెరవేర్చిన కాంగ్రెస్ పార్టీ అల్లూరి జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్చార్జ్ వంతల సుబ్బారావు, తెదేపాలో ఆ పార్టీ బలోపేతానికి ఇంచార్జ్ హెూదాలో అలుపెరుగని పోరాటం చేసిన గిడ్డి ఈశ్వరి లకు సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆయా పార్టీలు వారికి జలక్ ఇచ్చాయి. ఆయా పార్టీలలో తమకు ప్రత్యామ్నాయం ఎవరు లేరని, తమ అభ్యర్థిత్వాలే దాదాపుగా ఖరారు అవుతాయని ఆశించిన తరుణంలో అనుకోకుండా ఆయా పార్టీలలో చేరిన ఆశావహులను అధిష్టానాలు అక్కున చేర్చుకుని వారికి టిక్కెట్లు కేటాయించడంతో కాంగ్రెస్ పార్టీలో వంతల సుబ్బారావు, తెదేపాలో గిడ్డి ఈశ్వరిలు ఆ పరిణామాలను జీర్ణించుకోలేకపోతున్నారు. గడచిన ఐదేళ్లుగా లక్షలాది రూపాయలు ఖర్చు చేసుకొని పార్టీని ఒక్కతాటిపై తీసుకువచ్చిన తమను పార్టీలు విస్మరించడం భావ్యం కాదని, కాంగ్రెస్ పార్టీలో క్యాడర్ బలంగా ఉన్న వంతల సుబ్బారావు, అదేవిధంగా తెదేపాలో బలమైన శక్తిగా ఎదిగిన గిడ్డి ఈశ్వరిలు రాబోవు సార్వత్రిక ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగేందుకు సన్నాహాలు చేసుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఇంటింటికీ పింఛన్ల పంపిణీ : ఎంపీడీఓ

విశాలాంధ్ర-ముంచంగిపుట్టు : మండలంలోని 23 పంచాయతీల్లో రాష్ట్ర ఎన్నికల కోడ్ దృశ్యా మేరకు పంచాయతీల్లో పింఛన్ల లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికీ పింఛన్ల పంపిణీ చేస్తున్నామని ఎంపీడీవో కె కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ 23 పంచాయతీ పరిధిలో గల 18 పంచాయతీల పరిధిలో ఇంటింటికి పెన్షన్ అందిస్తామన్నారు మిగిలిన ఐదు పంచాయితీలు పరిధిలో పెన్షన్ దారులు సచివాలయాలకి వెళ్లి తీసుకోవాలని ఆ పంచాయతీల్లోని కార్యాలయానికి రాకుండా ఇంట్లోనే సచివాలయ సిబ్బంది తీసుకుని వచ్చి ఇస్తారనారు మిగిలిన ఈ క్రింది తెలిపిన ఐదు పంచాయితీ పరిధిలో గల మాకవరం దొడ్డిపుట్టు వనగుమ్మ రంగబయలు లక్ష్మీపురం పంచాయతీల్లో పింఛన్లను ఇంటింటికీ పంపిణీ చేసే పరిస్థితిలేదని పంచాయతీల్లో పెన్షనర్లు సంబంధిత పంచాయతీ కార్యాలయానికి వెళ్లి పింఛన్ మొత్తాన్ని తీసుకోవలన్నారు.సచివాలయ పంచాయతీ కార్యాలయంలో తాగునీరు నీడ సీటింగ్ ఏర్పాట్లు సచివాలయ సిబ్బంది ఏర్పాటు చేస్తారు. ఏమైనా సందేహాలుంటే పెన్షనర్లు సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శిని సంప్రదించవచ్చుఅని ఎంపీడీఓ కిరణ్ కుమార్ అన్నారు. పింఛన్ల పంపిణీలో ఏ రాజకీయ నాయకుడినీ అనుమతించరు. ఎవరైనా రాజకీయ పార్టీ సభ్యుల ప్రమేయం ఉంటే ఎంసీసీ ఉల్లంఘన కింద కేసులు నమోదు చేస్తామన్నారు.

అక్రమ కట్టడాన్ని అడ్డుకున్న తహశీల్దార్

విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర-ముంచింగిపుట్టు : మండల కేంద్రంలో గల గిరిజన సహకార సంస్థ గోదాము ఎదురుగా మండల విద్యాశాఖ అధికారి కార్యాలయానికి ఆనుకొని ఓ గిరిజనేతరుడు 1/70 చట్టాన్ని అతిక్రమించి అక్రమ కట్టడాలు కడుతున్నట్లు విశాలాంధ్రలో వచ్చిన వార్తకు స్పందించిన మండల తహసీల్దార్ రఫీజాన్ ఆదేశాలతో బుధవారం మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ వి.రవికుమార్ వీఆర్వో చెండా రమేష్ గ్రామ సచివాలయ ఇంజనీర్ సిబ్బంది గిరిజనేతరుడు అక్రమ కట్టడాన్ని పరిశీలించినట్లు ఆయన తెలిపారు. ఈసందర్భంగా మండల తహసిల్దర్ రఫీజాన్ విలేకరులతో మాట్లాడుతూ అక్రమంగా కడుతున్న గిరిజనేతరుడుని గురువారం మండల తహసిల్దార్ కార్యానికి వచ్చి సంజాయిషీ ఇచ్చుకోవాలని ఆదేశాలు జారీ చేశామని ఆయన అన్నారు. ప్రస్తుతానికి ఆ స్థలంలో ఎటువంటి అక్రమ కట్టడాలు కట్టరాదని, కట్టినట్లయితే కఠిన చర్యలు తప్పవని మండల తహసిల్దార్ రఫీజాన్ అన్నారు.

ఓటు హక్కు వినియోగంతోనే మెరుగైన సమాజం : కలెక్టర్ విజయ సునీత

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : మెరుగైన సమాజం, ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు ఓటే పునాదని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత అన్నారు. ప్రతీ ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని పటిష్టమైన ప్రజా స్వామ్యానికి పునాది వేయాలని పేర్కొన్నారు. స్థానిక ఏపి గురుకులం కళాశాలలో బుధవారం నిర్వహించిన క్రమబద్ధమైన ఓటర్ల విద్య మరియు ఎన్నికల భాగ స్వామ్య పై అవగాహన (స్వీప్) కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రండి ఓటేద్దాం అంటూ పిలుపు నిచ్చారు. ప్రజాస్వామ్య సౌధం నిర్మాణానికి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని స్పష్టం చేసారు. ఈనెల 14 వ తేదీ వరకు ఓటరు నమోదు కార్య క్రమం జరుగుతోందన్నారు. ఇంకా ఎవరైన ఓటు నమోదు చేసుకోలేకపోతే నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో 7.70 లక్షల మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. ఎటపాక, కూనవరం మండలాల నుండి అనంతగిరి మండలం వరకు జిల్లాలో స్వీప్ కార్యక్రమం నిర్వహించి మారు మూల ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నామని చెప్పారు. ప్రలోభాలకు లోను కాకుండా కులం, మతంలను చూడకుండా విజ్ఞతతో ఓటు వేయాలని స్పష్టం చేసారు. పాడేరు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ట మాట్లాడుతూ ఎన్నికల పర్వంలో అందరూ పాల్గొని దేశానికి గర్వకారణంగా నిలవాలన్నారు. ఎన్నికల పర్వం దేశానికి గర్వమని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ మే 13వ తేదీని గుర్తించుకోవాలని చెప్పారు. అరకు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి, ఐటిడి ఏ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ మాట్లాడుతూ తొంబై శాతం ఓటు నమోదు లక్ష్యంగా నిర్దేశించు కున్నామని చెప్పారు. పోలింగ్ కేంద్రాలకు పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు సమకూర్చామని పేర్కొన్నారు. ఎన్నికలలో 70 శాతం ఓటు నమోదయ్యిందన్నారు. ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగంచు కోవాలని కోరారు. అదనపు ఎస్పీ ధీరజ్ మాట్లాడుతూ ఓటర్లందరూ నిర్భయంగా ఓటు వేయాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి పటిష్టమై భద్రతా పర్యలు చేపట్టామన్నారు. ఎవరూ ప్రలోభాలకు లోను కాకుండా ప్రజామ్యబద్ధంగా ఓటు వేయాలన్నారు. ఓటును అడ్డు కుంటే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. రంప చోడవరం సబ్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ఓటును వృదా చేయకుండా ఓటర్లుందరూ ఓటు వేయాలని సూచించారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముందుగా జి.మాడుగుల, కె. కోడాపల్లి గ్రామాలకు చెందిన స్వయం సహాయ సంఘాల సభ్యులు కోలాటంతో అతిథులక స్వాగతం పలికారు. మహిళలు ఓటు హక్కు వినియోగం పై వేసిన రంగ వల్లులను అతిధులు తిలకించారు. ఉత్తమ రంగ వల్లులకు బహుమతులను అందజేసారు. ఆర్. లక్ష్మి, ఎస్.పద్మ, ఎస్. శ్యామల ప్రధమ, ద్వితీయ, తృతీయ బహుమతులను సొంతం చేసుకున్నారు. అలరించిన సాంస్కృతిక కార్య క్రమాలు వివిద మహిళా సంఘాల సభ్యులు దీంసా నృత్యం, కోలాలటం నృత్యాలు ప్రదర్శించి అలరించారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఐటిడిఏ పిఓ కోలాటం ప్రదర్శనలో పాల్గొని సందడి చేసారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అరకు ఎంపీ మాధవితో అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం భేటీ

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : అరకు నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం ఎంపీ గొట్టేటి మాధవితో బుధవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. పాడేరు నియోజకవర్గం కొయ్యూరు మండలం, శరభన్నపాలెం గ్రామంలో ఎంపీ స్వగృహం నందు ఎంపీను అరకు అసెంబ్లీ పరిశీలకులు జల్లిపల్లి సుభద్ర, శోభ హైమావతి తో కలిసి ఆయన కలుసుకున్నారు. ఈసందర్భంగా ఎంపి మాట్లాడుతూ రాష్ట్రానికి మరోసారి మనందరి ప్రియతమ నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ను ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా సమిష్టి కృషితో ఎన్నికలకు సిద్ధమవ్వాలని దిశనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నేత కమ్మిడి అశోక్, ఎంపిటిసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిర్ధారణ పరీక్షల నివేదికలు సకాలంలో అందజేయాలి

డిఎంఓ డాక్టర్ జగన్‌మోహనరావు

విశాలాంధ్ర-బెలగాం : వ్యాధి నిర్ధారణ పరీక్షలు పక్కాగా నిర్వహించి నివేదికలు సకాలంలో అందజేయాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఓ) డాక్టర్ టి.జగన్‌మోహనరావు ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయంలో డిఎంఓ ఆధ్వర్యంలో ల్యాబ్ టెక్నీషియన్లకు నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి ప్రతీ రోజూ ఆరోగ్య తనిఖీల కొరకు వస్తున్న వారిలో మరియు క్షేత్ర స్థాయిలో చేపడుతున్న సర్వలెన్స్ లో జ్వర లక్షణాలున్న వారికి సేకరించిన రక్తపూతల నమూనాలను సకాలంలో పరీక్షలు జరిపి నివేదికలు వెంటనే తెలియజేయాలన్నారు. అదేవిధంగా ఆ వివరాలు ల్యాబ్ రికార్డులో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. మలేరియా, డెంగ్యూ నిర్ధారణ అయితే ఐహెచ్ఐపి పోర్టల్ లో ఆన్లైన్ నమోదు తప్పనిసరి అన్నారు. తద్వారా క్షేత్ర స్థాయి సిబ్బంది ఆ ప్రదేశంలో నివారణ చర్యలు చేపట్టాలన్నారు. హెల్త్ అసిస్టెంట్స్, హెల్త్ సూపర్ వైజర్ల సందర్శనల వివరాలతో నెలవారీ ప్రణాళికను (టూర్ డైరీ) కార్యాలయానికి అందజేయాలన్నారు. ప్రాంతీయ, జిల్లా, కమ్యూనిటీ హెల్త్ ఆసుపత్రిలోగానీ, ప్రక్క జిల్లాలోగానీ మలేరియా, డెంగ్యూ నిర్ధారణ అయితే ఆ వివరాలు ఎంఎఫ్-7 రికార్డులో నమోదు చేయాలన్నారు. ప్రతీ పిహెచ్సిలో ఆక్టివ్ (క్షేత్ర స్థాయిలో), పాసివ్ (ఆసుపత్రిలో) బ్లడ్ శాంపిల్స్ లక్ష్యాన్ని అధిగమించాలి. ఎం4, ఎంఎఫ్7, ఎంఎఫ్9 ల్యాబ్ రికార్డులను పక్కాగా నిర్వహించి, వారాంతపు, నెలవారీ నివేదికలు సకాలంలో డిఎంఓ కార్యాలయానికి అందజేయాలని ఆదేశించారు. ఫైలేరియా నైట్ బ్లడ్ సర్వేలో సేకరించిన రక్త పూతలను ల్యాబ్ లో సకాలంలో పరీక్షలు జరిపి నివేదికలు తెలియజేయాలన్నారు. ఆసుపత్రుల్లో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర కీలకమని,ల్యాబ్ నిర్వహణ పటిష్టంగా ఉన్నప్పుడే వ్యాదుల పట్ల ప్రజలను సకాలంలో అప్రమత్తం చేయవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంఓ సూర్యనారాయణ, జిల్లా విబిడి కన్సల్టెంట్ రామచంద్ర, మలేరియా సబ్ యూనిట్ అధికారులు, ఈఓ నాగేంద్ర, ఎంటిఎస్ లు, కార్యాలయ సిబ్బంది, ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల, ప్రాంతీయ, జిల్లా, కమ్యూనిటీ ఆసుపత్రుల ల్యాబ్ టెక్నీషియన్లు తదితరులు ఉన్నారు.

మిమ్స్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: మిమ్స్ హాస్పిటల్ లో పనిచేస్తున్న ఉద్యోగుల తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని గత 62 రోజులుగా వివిధ రూపాలలో ఆందోళన చేస్తున్నా ప్రభుత్వానికి ఏమాత్రం చలనం లేదనీ సిఐటియు నాయకులు అన్నారు.బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు వెంకటరమణ మాట్లాడుతూ న్యాయమైన సమస్యలు కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, వేతన ఒప్పందం చేయాలని, సస్పెండ్ లు వేధింపులు ఆపాలని, ప్రభుత్వం ప్రకటించిన డి ఏను అమలుచేయాలని, అన్యాయంగా తొలగించిన ఇద్దరు ఉద్యోగులను వెంటనే విధులోకి తీసుకోవాలని, చిన్నచిన్న కారణాలు చూపించి జరిమానాలు విధించి ఉద్యోగుల నుండి రికవరీ చేసే పద్ధతిని ఆపాలని, యూనియన్ ద్వారా వేతనం ఒప్పందం చేయాలని 62 రోజులుగా రాజ్యాంగబద్ధంగా పోరాడుతుంటే యాజమాన్యం చట్టాలను ధిక్కరించి మొండిగా వ్యవహరిస్తుంది. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి చర్చలు జరిపి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

సెక్టార్ అధికారులతో రిటర్నింగ్ అధికారి సమావేశం

విశాలాంధ్ర -బెలగాం: పార్వతీపురం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత బుధవారం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సెక్టార్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ మరియు పోస్టల్ బ్యాలెట్ లపై వివిధ సూచనలు చేశారు.కార్యక్రమంలో పార్వతీపురం తహసిల్దార్ కె.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్తాం

జిల్లా అధ్యక్షులు నిమ్మక సింహాచలం, ఎమ్మెల్యే అభ్యర్థి బత్తిన మోహనరావు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని, ప్రజా సంక్షేమ పార్టీ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నిమ్మక సింహాచలం, ఎమ్మెల్యే అభ్యర్థి బత్తిన మోహనరావు అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి బత్తిన మోహన్ రావు మాట్లాడుతూ గతంలో ఎంతోమంది ఎమ్మెల్యేలుగా గెలిచినప్పటికీ పార్వతీపురం సమస్యలను గాలికి వదిలేసారని, అందులో ప్రధానంగా తాగునీరు, డంపింగ్ యార్డు సమస్యలే కీలకమన్నారు. సామాన్యుడైన నన్ను గుర్తించి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎమ్మెల్యే టికెట్ కేటాయించడం ఆనందంగా ఉందన్నారు. నాటిక్కెట్ కోసం సహకరించిన పార్టీ పెద్దలకు నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో దళితులకు, ముస్లింలకు, క్రైస్తవులకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పేదలపక్షం అని, ప్రజా సంక్షేమ పార్టీ లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ఎన్నికల్లో నేను తప్పకుండా ఎమ్మెల్యేగా గెలిచి తీరుతానని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నిమ్మక సింహాచలం మాట్లాడుతూ ఏపీ పిసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి ప్రకటించిన 9 గ్యారంటీలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలో వస్తె రాష్ట్రానికి 10 ఏళ్ల ప్రత్యేక హెూదా, ప్రతి పేద మహిళలకు ప్రతినెల 8333 ఇస్తామని, ఏడాదికి లక్ష రూపాయలు ఇస్తామని, ఇది మహిళకు బరోసా ఇచ్చే పథకమని అన్నారు. రైతులకు 2 లక్షల వరకు రుణమాఫీ, పెట్టుబడి మీద 50 శాతం లాభం తో కొత్త మద్దతు ధర, ఉపాధి హామీ పథకం కింద కూలీలకు కనీస వేతనం 400రూపాయలు, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.25లక్షల ఉద్యోగాల భర్తీ చేయడం జరుగుతుందన్నారు. అలాగే ఇళ్లు లేని ప్రతి పేద కుటుంబానికి మహిళ పేరు మీద 5 లక్షలతో పక్కా ఇళ్లు, ఇంట్లో ఎంత మంది ఉంటే అందరికీ పెన్షన్, అర్హులైన ప్రతి ఒక్కరికీ 4వేల పెన్షన్, వికలాంగులకు 6వేల పెన్షన్ అందించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జమ్మన ప్రవీణ్ కుమార్, సిహెచ్ వెంకటరమణ, పి రవికుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

విశాలాంధ్ర-గరుగుబిల్లి : మండల పరిధిలోని ఎర్రన్న గుడి జంక్షన్ పరిధిలో మంగళవారం రాత్రి కారు ఢీకొన్న సంఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. ఈమేరకు స్థానిక ఎస్సై వై అమ్మనరావు అందించిన సమాచా రం ప్రకారం ఖడ్గవలస జంక్షన్ వైపు నుండి పార్వతిపురం వస్తున్న ద్విచక్ర వాహనమును పార్వతీపురం నుండి గుమ్మలక్ష్మిపురం వైపు వెళుతున్న కారు ఢీకొందన్నారు. ఈప్రమాదంలో పార్వతీపురంకు చెందిన ఎం.బాలయ్య, ఎస్.ప్రదీప్‌లు గాయాలకు గురయ్యారన్నారు. ఈమేరకు పార్వతిపురం జిల్లా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించడం జరిగిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అమ్మనరావు తెలిపారు.

నేటి నుంచి అంగన్వాడీ కేంద్రాలకు ఒంటిపూట

విశాలాంధ్ర-గరుగుబిల్లి : ఎండలు తీవ్రత పెరిగిన నేపథ్యంలో అంగన్వాడీ కేంద్రాలను గురువారం నుంచి ఒంటిపూట నిర్వహించనున్నారు. ఎండలు తీవ్రత కారణంగా అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలు ఇబ్బందులకు గురి కాకుండా ఉండేందుకు వీలుగా ఉన్నతాధికారులు అంగన్వాడీ కేంద్రాలను ఒంటి పూట నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కేంద్రాలు ఉంటాయన్నారు. అదే విధముగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఐరన్ మందు బిళ్ళలు కేంద్రాల్లో సిద్ధంగా ఉంచేలా చర్యలు చేపట్టారు. ఇదిలాఉండగా మే1 తేదీ నుంచి 15వ తేదీవరకు అంగన్వాడీ కార్యకర్తలకు 16వ తేదీ నుంచి 30వ తేదీవరకు సహాయకులకు సెలవులు మంజూరు చేయడం జరిగిందని ఐసిడిఎస్ సూపర్వైజర్ రైతు లక్ష్మి తెలిపారు.

మండలంలో పింఛన్‌లు పంపిణీ

విశాలాంధ్ర-గరుగుబిల్లి : ప్రభుత్వ ఆదేశాలు మేరకు మండలంలో సామాజిక పింఛన్లు పంపిణీ బుధవారం ప్రారంభం అయింది. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోవున్న నేపథ్యంలో గ్రామ సచివాలయాల వాలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేయకూడదని ఎన్నికల కమిషన్ సంబంధిత అధికారులను ఆదేశిం చడం జరిగింది. ఈనేపథ్యంలో గ్రామ సచివాలయాలకు చెందిన అధికారులు బుధవారం బ్యాంకుల నుంచి పింఛన్లకు సంబంధించిన నగదును డ్రాచేసిన అనంతరం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదేవిధంగా దివ్యాం గులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, మంచం మీద నుంచి కదలలేనివారికి ఇంటికి వెళ్లి సచివాలయం సిబ్బంది పింఛన్లను అందజేయనున్నారు. మండల పరిధిలోని గొట్టివలస గ్రామంలో సచివాలయ సిబ్బంది పంపిణీ చేస్తున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మండల ఈఓపిఆర్‌డి ఎల్.గోపాలరావు, ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది గులిపల్లి ప్రవీణ్ కుమార్‌లు పరిశీలించారు. అదేవిధంగా గరుగుబిల్లి గ్రామంలో సచివాలయ సిబ్బంది పూడి మన్మధరావు తదితరుల ఆధ్వర్యంలో ఫింఛన్‌ల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో గొట్టివలస సచివాలయ సిబ్బంది గంట జనార్ధనరావు, రెడ్డి కుంతి, తదితరులు పాల్గొన్నారు.

మరొక్కసారి అవకాశం ఇవ్వండి... మరింత అభివృద్ధి చేస్తా

పింఛన్ల శాపం చంద్రబాబుదే... డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర

విశాలాంధ్ర-పాచిపెంట : మరొక్కసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేసి రాజన్న దొర ఏమిటో చూపిస్తానని డిప్యూటీ సీఎం రాజన్న దొర అన్నారు. మండలంలో గల పాంచాలి గ్రామంలో గడపగడపకు వైఎస్ఆర్సిపి కార్యక్రమం నిర్వహించారు. పల్లెల్లో ప్రచారానికి వెళ్తున్న వైసీపీ నాయకులకు ఎక్కడికి వెళ్లినా ఎక్కడ చూసినా పింఛన్లు గోల తప్ప మరో సమస్య కనబడటం లేదు. ప్రత్యక్షంగా వైసిపి ప్రచారంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొరకు ఎదురైన చేదు అనుభవం. ఏవీధి గడపకు వెళ్లినా అయ్యా ఇంకా పెన్షన్ అందలేదు, ఇంతకుముందు ఒకటో తేదీకి వలంటీర్లు తెచ్చి ఇచ్చేవారని నేడు మూడవ తేదీ వచ్చినప్పటికీ మాకు పెన్షన్ అందడంలేదని ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని డిప్యూటీ సీఎం రాజన్న ముందు ఆవేదన వినిపించారు. పింఛను దారులతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ నాయకులు పవన్ కళ్యాణ్ కలసి చేసిన కుట్రకు మీరంతా బలయ్యారని వాలంటీర్లు వలన ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో, హైకోర్టులో పిటిషన్ వేయడంతో వలంటీర్లను తప్పించారని అందుకే మీకు పెన్షన్లు అందడంలేదని, వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని సీఎంగా చేసి మరలా నన్ను గెలిపిస్తే మనమంతా ఒక్కటై ఏ సమస్యలు రాకుండా లేకుండా అంతా కలిసిమెలిసి ఉంటామని ఆయన కోరారు. గత నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, డిప్యూటీ సీఎంగా చేసిన అభివృద్ధి పనులు, చేపట్టిన సంక్షేమ పథకాలకు ఆయన వివరించారు. మరలా మీకే ఓటు వేస్తామని హామీ ఇస్తున్నారు. ఆయనతోపాటు జిల్లా ప్రధాన కార్యదర్శి డోల బాబ్జి ప్రచారం చేపట్టారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. మేలు చేసిన జగన్మోహన్ రెడ్డిని మరువ వద్దని, మీ పొట్ట కొట్టిన తెలుగుదేశం జనసేన నాయకులను చిత్తుగా ఓడించాలని ఈ సందర్భంగా పాంచాలి ప్రజలను ఆయన కోరారు. ఈ సందర్భంగా పాంచాలి గ్రామ పెద్ద మాజీ పెద్ద గడ్డ నీటి పారుదల సంఘం అధ్యక్షులు, టిడిపి నాయకులు కలువులపల్లి రామన్న దొర ను డిప్యూటీ సీఎం రాజన్న దొర, స్థానిక నాయకులు మాజీ ఉపసర్పంచ్ నారాయణ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి డోలా బాబ్జి, మండల పార్టీ అధ్యక్షులు ముత్యాల నాయుడులు ఆయన వెంట జిల్లా కార్యదర్శి పెద్ది బాబు, మాజీ ఉపసర్పంచ్ నారాయణరావు, కలువలపల్లి అప్పన్న బాబు,మాజీ వైస్ ఎంపీపీ గండిపల్లి రాము, మాజీ ఉపసర్పంచ్ కొల్లి కొత్తయ్య, స్థానిక నాయకులు, ప్రజలు, కార్యకర్తలు అభిమానులు హాజరయ్యారు.

'సిక్కోలు రాజకీయ చరిత్ర' పుస్తకం ప్రదానం

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం పట్టణానికి చెందిన జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ డాక్టర్ మంచిపల్లి శ్రీరాములుకు బుధవారం డా. బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం (శ్రీకాకుళం) మీడియా సంబంధాల విభాగం సమన్వయకర్త, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.జి.లీలావర ప్రసాదరావు తాను రాసిన 'సిక్కోలు రాజకీయ చరిత్ర' పుస్తకాన్ని ప్రదానం చేశారు. ఆయనతో పాటు మరో అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.గొర్లె తిరుపతిరావు, రెడ్ క్రాస్ సభ్యులు కూడా ఉన్నారు. సిక్కోలు రాజకీయ చరిత్ర (1920-2020) పుస్తకాన్ని ఎంతో కృషి చేసి రాసిన డా. లీలావరప్రసాదరావును డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు బహుధా అభినందించారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం

- కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్తాం
- విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నిమ్మక సింహాచలం, ఎమ్మెల్యే అభ్యర్థి బత్తిన మోహనరావు

విశాలాంధ్ర-బెలగాం : కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని, ప్రజా సంక్షేమమే పార్టీ ధ్యేయమని పార్వతీపురం మన్యం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిమ్మక సింహాచలం, పార్వతీపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బత్తిన మోహనరావు అన్నారు. బుధవారం సాయంత్రం పార్వతీపురం బైపాస్ రోడ్‌లోగల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి బత్తిన మోహనరావు మాట్లాడుతూ గతంలో ఎంతో మంది ఎమ్మెల్యేలుగా గెలిచినప్పటికీ పార్వతీపురం సమస్యలను గాలికి వదిలేసారని, అందులో ప్రధానంగా తాగునీరు, డంపింగ్ యార్డు సమస్యలే కీలకమన్నారు. పార్వతీపురం నియోజకవర్గంలో అన్ని దళిత సామాజిక వర్గాలతో పాటు ఇతర సామాజిక వర్గాలను అందరి సోదరులను కలుపుకొని ముందుకెళ్తానన్నారు. ఈఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తామని అన్నారు. సామాన్యుడైన నన్ను గుర్తించి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎమ్మెల్యే టికెట్ కేటాయించడం ఆనందంగా ఉందన్నారు. నా టిక్కెట్ కోసం సహకరించిన పార్టీ పెద్దలకు నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో దళితులకు, ముస్లింలకు, క్రైస్తవులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కాంగ్రెస్ పార్టీ పేదల పక్షం అని, ప్రజా సంక్షేమ పార్టీ లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ఎన్నికల్లో నేను తప్పకుండా ఎమ్మెల్యేగా గెలిచి తీరుతానని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నిమ్మక సింహాచలం మాట్లాడుతూ ఏపి పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి ప్రకటించిన 9 గ్యారంటీలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి 10 ఏళ్ల ప్రత్యేక హోదా, ప్రతి పేద మహిళలకు ప్రతి నెల 8,333 ఇస్తామని, ఏడాదికి లక్ష రూపాయలు ఇస్తామని, ఇది మహిళకు భరోసా ఇచ్చే పథకమని అన్నారు. రైతులకు 2 లక్షల వరకు రుణమాఫీ, పెట్టుబడి మీద 50 శాతం లాభంతో కొత్త మద్దతు ధర, ఉపాధి హామీ పథకం కింద కూలీలకు కనీస వేతనం 400 రూపాయలు, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.25లక్షల ఉద్యోగాల భర్తీ చేయడం జరుగుతుందన్నారు. అలాగే ఇళ్లు లేని ప్రతి పేద కుటుంబానికి మహిళ పేరు మీద 5 లక్షలతో పక్కా ఇళ్లు, ఇంట్లో ఎంత మంది ఉంటే అందరికీ పెన్షన్, అర్హులైన ప్రతి ఒక్కరికీ 4 వేల పెన్షన్, వికలాంగులకు 6 వేల పెన్షన్ అందించడం జరుగుతుందన్నారు. ఈఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించి ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఈసమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జమ్మాన ప్రవీణ్ కుమార్, సిహెచ్ వెంకటరమణ, పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడ్డవారికే టికెట్ ఇవ్వాలి : మండల టిడిపి నాయకులు

విశాలాంధ్ర-గంగవరం : ఎంతో కాలంగా పార్టీ కోసం కష్టపడ్డ వారిని కాకుండా కొత్తవారి కి టికెట్ ఇస్తే గెలుపు కష్టమని మండల టిడిపి పార్టీ ముఖ్య నేతలు పార్టీ అధిష్టానానికి సూచన చేశారు. బుధవారం గంగవరంలో మండలంలోని ముఖ్య నేతలు అత్యవసరంగా సమావేశమై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిడిపి పార్టీ రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి కనిగిరి రాంబాబు, మాజీ మండల పరిషత్ అధ్యక్షురాలు డాక్టర్ తీగల ప్రభ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో గత ఐదు సంవత్సరాలుగా ప్రతిపక్షంలో ఉంటూ రాత్రి పగలు ఒక హంతకుడుని ఎదుర్కోవడం పోరాటాలు సాగించడం, కేసులు పెట్టించుకోవడం జరిగింద న్నారు. పార్టీ కోసం అహర్నిశలు పోరాటం చేసిన మాజీ ఎమ్మెల్యే, రంపచోడవరం నియోజకవర్గం ఇంచార్జ్ వంతల రాజేశ్వరీ కాదని ఎవరో తెలియని, ఎవరికి తెలియని మిరియాల శిరీష దేవికి అధిష్టానం టికెట్ ఇవ్వడంవల్ల పార్టీకి తీవ్రనష్టం కలుగు తుందన్నారు. అనంతబాబును ఘోరంగా ఓడించా లంటే వంతల రాజేశ్వరి గాని మరి మరో వ్యక్తికి గాని టికెట్ ఇవ్వాలన్నారు. మిరియాల శిరీష దేవికి టికెట్ ఇవ్వడంతో కార్యకర్తలు, అయోమయంలో ఉన్నారన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం ఎంత అవసరమో నియోజక వర్గంలో టిడిపి ఎమ్మెల్యే గెలవడం అంతే అవసరం అన్నారు. వంతల రాజేశ్వరికి టికెట్ఇస్తే భారీ మెజార్టీతో గెలిపించి చంద్రబాబుకు కానుకగా ఇస్తామన్నారు. ఈసమావేశంలో మాజీ ఎంపీపీ తూరోతు శ్రీరాములు, అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ కార్యదర్శి పల్లాల వెంకటరెడ్డి, ఆముదాల బంధ ఎంపీటీసీ పండ ఆదినారాయణ, సర్పంచ్ కలుముల అక్కమ్మ, మాజీ ఎంపీటీసీ కోసు బుల్లియమ్మ, దొర మామిడి సర్పంచ్ పండా శశికళ, పార్టీ నాయకులు నరసి సూరమ్మ మడకం రామారావు దొర, తూరోతు వినయ్ మాధవరెడ్డి,ఎం నరసన్న దొర, కే రాణి ఎం రామిరెడ్డి, పేరు బుల్లబ్బాయి రెడ్డి, డి.వెంకట్ రెడ్డి, డి.అప్పలరెడ్డి, డి.స్వామిరెడ్డి, డి.కొండయ్యరెడ్డి, కే.చిన్నికృష్ణ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

యాదవులు అన్నిరంగాల్లో ఎదగాలి

విశాలాంధ్ర -వి.ఆర్.పురం: యాదవులు రాజకీయంగా ఆర్థికంగా అన్ని రంగాలలో నిలదొక్కుకోవాలంటే అందరం కలిసికట్టుగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని, యాదవ సంఘం నాయకులు మోడెం నరేశ్ స్పష్టంచేశారు. యాదవ సంఘం కమిటీ ఎన్నుకొని ఏడాది ముగిసిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో, జిల్లాల స్థాయిలో, డివిజన్ల వారీగా మండలాల వారీగా యాదవ సంఘం, సంవత్సరం పూర్తి చేసుకుందని, ఐకమత్యం మహాబలం అనే నినాదంతో ముందుకు వెళ్తున్నామని ఆయన అన్నారు. యాదవులు ఆర్థికంగా బలంగా ఉన్నా విడదీసి పరిపాలించాలని, కొన్నిశక్తులు భిన్నాభిప్రాయాలతో నష్టపోతున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్వలాభం కాకుండా జాతినిర్మాణం కోసం, యాదవులు అభివృద్ధి చెందేందుకు కృషి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన సూచించారు. ఒకరిపైఒకరు భేదాభిప్రాయాలతో ముందుకు వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయని ఆయన అన్నారు. ఏది ఏలాఉన్నా సంఘం బలంగా ఉండాలనేదే నాఉద్దేశమని ఆయన తెలిపారు. మన గ్రామాల అభివృద్ధి పైదృష్టి, విద్యాఅవకాశాలపై దృష్టి,ఉద్యోగ అవకాశాలపై దృష్టి, రాజకీయంగా అన్నివిధాలుగా అభివృద్ధి సాధించేందుకు సంఘం

బలోపేతం దిశగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యాదవ సంఘం అధ్యక్షులు కుర్ర శ్రీనివాస్ యాదవ మండల అధ్యక్షులు మోడెం నరేశ్ యాదవ్, వైస్ ప్రెసిడెంట్ మాడి ముత్యాలరావు యాదవ్, జాయింట్ సెక్రటరీ కట్టిబొయిన వినోద్‌కుమార్ యాదవ్, మండల జర్నల్ సెక్రటరీ మోడెం రాజేష్ యాదవ్ చింతం రాజు యాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం అభ్యర్థికే మా ఓటు..!

సాలెబుడప గ్రామస్థుల ఏకగ్రీవ తీర్మానం

విశాలాంధ్ర-ఎటపాక : ప్రజా సమస్యలపై అను నిత్యం పోరాడే సిపిఎం అభ్యర్థికి మా ఓటు వేస్తామంటూ విస్సాపురం పంచాయతీ సాలెబుడప గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. బుధవారం గ్రామస్తులు సమావేశం ఏర్పాటు చేసి సిపిఎం నాయకులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు పార్టీ నేతలతో మాట్లాడుతూ మా గ్రామంలో పలు సమస్యలను పరిష్కరించి, సమస్యలు వచ్చిన ప్రతి సందర్భంలో మాకు వెన్నంటి నిలిచిన సిపిఎం పార్టీకే మా ఓటు వేస్తామని, ఆ విధంగా గ్రామస్తులమంతా తీర్మానించుకున్నామని వారు పార్టీ నాయకులకు తెలిపారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరావు మాట్లాడుతూ ఆదివాసులకు అండగా నిలిచే పార్టీ సిపిఎం ఒకటేనని, ప్రజా సమస్యల పరిష్కారంలో, గ్రామాల అభివృద్ధిలో సిపిఎం పార్టీ దిక్సూచిగా నిలిచిందని అన్నారు. చట్టసభల్లో సిపిఎం ప్రతినిధి ఉండాల్సిన అవసరం ఈ సమయంలో ఎక్కువగా ఉందని వారు అన్నారు. సిపిఎం పార్టీ సభ్యులు చట్ట సభల్లో లేనందుల వలన గిరిజన చట్టాల హక్కులకు భంగం కలుగుతుందని అన్నారు, గిరిజనులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని మర్లపాటి

నాగేశ్వరావు అన్నారు. కావున ఆదివాసిలంతా ఆలోచించి ఒక తాటిపైకి వచ్చి సిపిఎం అభ్యర్థిని గెలిపించాలని వారు అన్నారు. మద్దతు తెలుపుతున్న గ్రామస్తులు వారు అభినందించారు. ఇదే ఒరవడి మిగతా గిరిజన గ్రామాల్లో కూడా వస్తే సిపిఎం అభ్యర్థి రంపచోడవరం నియోజకవర్గం లో సునయాసంగా గెలుస్తారని వారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇరప అజయ్, సోయం వీరమ్మ, పర్సిక ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమి బీజేపీ ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతను ఓడించండి

ఆదివాసీ గిరిజనులకు గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు

విశాలాంధ్ర-అరకులోయ : 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో అరకు ఎంపీ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స, అరకు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దిసారి గంగరాజు గెలిపించాలని గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ ఆదివాసి గిరిజనులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సురేంద్ర జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలదేవ్ మాట్లాడుతూ ఆదివాసి చట్టాలు హక్కులు రక్షణకై పోరాటాలు చేస్తున్న సిపిఎం పార్టీ అభ్యర్థులను గెలిపించి చట్టసభలో పంపించాలని, ఆదివాసి గొంతు వినిపించే అభ్యర్థిలను గెలిపించి జీవో నెంబర్ 3 చట్టబద్ధత కల్పించాలని 1/70 చట్టం పీసా చట్టం అమలు చేయాలని అటవీ పర్యావరణం చట్టం రద్దుచేసి ఆదివాసి ప్రాంతం కార్పొరేట్ శక్తులకు ఒప్పచెప్పాలని కేంద్రంలోఉన్న బిజెపి ప్రభుత్వం కుట్ర

చేస్తుందన్నారు. విభజన హామీలో ఉన్న గిరిజన యూనివర్సిటీ 10సంవత్సరాల గడుస్తున్న పూర్తి చేయలేదన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో మునిగిపోతున్న ఆదివాసులకు ఇప్పటివరకు కూడా న్యాయం చేయలేదు విభజన హామీలు ఉన్న ప్రత్యేక హోదా ఇవ్వకుండా ఆంధ్ర రాష్ట్రానికి తీవ్రంగా అన్యాయం చేసిన బిజెపి ఓడించండి ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మి ఆదివాసులకు దళితులకు రిజర్వేషన్ ఎత్తేలని మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తుంది.400 ఎంపీ సీట్లు గెలిపిస్తే డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చేస్తామని బహిరంగ ప్రకటన చేస్తున్నారు ఆదివాసులకు వ్యతిరేకమైన ఎన్డీఏ కూటమి సహకరిస్తున్న టిడిపి వైయస్సార్ జనసేన పార్టీలను ఓడించండి రాజ్యాంగం హక్కులు కాపాడే సిపిఎం పార్టీ ఎంపీ ఎమ్మెల్యే అభ్యర్థిలను గెలిపించండి ఇండియా బ్లాక్ కూటమినీ బలపరచండి అని చెప్పారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో హెల్త్ అసిస్టెంట్ నియమించాలని రోడ్లు మంచినీరు సదుపాయం కల్పించాలని ఆదివాసులకోసం నిరంతరం పోరాడే సిపిఎం పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి పి రామన్న ఆదివాసి గిరిజన మండల నాయకులు కె జగన్నాధం తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా నాటు తుపాకులు అప్పగించిన గిరిజనులు

17 నాటు తుపాకులను స్వాధీనం చేసుకున్న అన్నవరం పోలీసులు

విశాలాంధ్ర-చింతపల్లి : గిరిజనుల చెంత ఉన్న 17 నాటు తుపాకులను బుధవారం అన్నవరం ఎస్సై పి రాజారావు ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకోవడం జరిగిందని సీఐ రమేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మారుమూల బలపం పంచాయతీ పరిధిలోని గిరిజనుల ఆధీనంలో ఉన్న నాటు తుపాకులు అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న గిరిజనులు స్వచ్ఛందంగా పోలీస్ స్టేషన్ లో అప్పగించినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున మారుమూల గిరి గ్రామాల్లో, ఎక్కడా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు గిరిజనులు వేటకు ఉపయోగించే నాటు తుపాకులను స్వచ్ఛందంగా పోలీస్ స్టేషన్ కు అప్పగించాలని అల్లూరి జిల్లా ఎస్పీ తూహిన్ సిన్హా ఆదేశాల మేరకు స్వచ్ఛందంగా అప్పగించడం జరుగుతుందన్నారు. అదే.విధంగా ఈ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు గిరిజనులు సహకరించాలని ఆయన కోరారు. గిరిజనుల వద్ద ఉన్న నాటు తుపాకులు త్వరగా స్టేషన్ కు అప్పగించాలని నాటు తుపాకులు వినియోగించే గిరిజనులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ రోగులు పోషకాహార కిట్లు సద్వినియోగం చేసుకోవాలి

దారకొండ పిహెచ్‌సి వైద్యాధికారి డీకే హిమబిందు

విశాలాంధ్ర-సీలేరు : క్షయ రోగులు పోషకాహార కిట్లను సద్వినియోగం చేసుకోవాలని దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డీకే.హిమబిందు అన్నారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కోహెన్స్ లైఫ్ సైన్స్ సిఎస్ఆర్ లో భాగంగా క్షయ రోగులకు అందజేసిన నిక్షాయ్ మిత్ర ఫుడ్ బాస్కెట్లను వైద్యాధికారి పంపిణీ చేశారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నున్న క్షయ రోగులకు నాణ్యమైన పోషకాహారం అందించాలనే లక్ష్యంతో కోహెన్స్ లైఫ్ సైన్స్ సిఎస్ఆర్‌లో భాగంగా నిక్షాయ్ మిత్రఫుడ్ బాస్కెట్లను పంపించడం జరిగిందన్నారు. ఈ ఫుట్ బాస్కెట్ల ద్వారా ఆయిల్, రాగి పిండి, వేరుశనగ, శనగపప్పు, కందిపప్పు బాధితులకు అందజేయడం జరిగిందన్నారు. క్షయ బాధితులు త్వరగా కోలుకునేందుకు పోషకాహారం చాలా ప్రాముఖ్యమన్నారు. క్షయ బాధితులకు పోషకాహారం అందిస్తున్న కోహెన్స్ లైఫ్ సైన్స్ ప్రతినిధులను అభినందిస్తున్నానని ఆమె తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ రాణి, ఎంపిహెచ్ఈఓ పోతురాజు, ఫార్మసిస్ట్ మూర్తి, ఎస్టిఎస్ జి.అశోక్‌కుమార్, ఎస్టిఎల్ఎస్ వెంకటరావు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు : ఐటిడిఏ పిఓ గనోరే

విశాలాంధ్ర-రంపచోడవరం : ఏజెన్సీలోని గిరిజన గ్రామాలలో మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు సంబంధించిన నివేదికలు సమర్పించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్‌గానోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వారి చాంబర్లో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో మౌలిక సదుపాయాలు ఏర్పాటు కొరకు ప్రాజెక్ట్ అధికారి సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గానోరే మాట్లాడుతూ ఏజెన్సీలోని బాగా వెనుకబడిన కొండ రెడ్డి కులస్తులకు కరెంటు సౌకర్యం, రహదారుల సౌకర్యం, పక్కా గృహాలు ఏర్పాటు చేయటం అదేవిధంగా త్రాగునీరు సౌకర్యం తదితర ఐదు సంవత్సరాలపాటు యాక్షన్‌ప్లాన్ నివేదికలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించడం జరిగింది, ముందుగా పక్కా గృహాలు ఏర్పాటుకు ఇప్పటివరకు ఏడు మండలాలలో ఎంతమంది కొండ రెడ్డి కులస్తులను గృహాలు ఏర్పాటు చేయుటకు గుర్తించింది, ఎంతమందికి గృహాలు మంజూరు అవినవి ఇప్పటివరకు ఎన్ని గృహాలకు సంబంధించిన పనులు జరుగుచున్నవి నివేదిలు సమర్పించాలని గృహ నిర్మాణశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ని ఆయన ఆదేశించారు. ఏజెన్సీలోని ఇప్పటివరకు ఎన్ని గ్రామాలలో త్రాగునీరు ఏర్పాటు చేసింది ఇంకా ఎన్ని గ్రామాలలో త్రాగునీరు ఏర్పాటు చేయవలసి ఉన్నది సంబంధిత గ్రామాలకు సంబంధించిన నివేదికలు సమర్పించాలని ఆయన అన్నారు. ఈపీడీసీఎల్ ద్వారా 7మండలాలలోని ఎన్ని గ్రామాలలో ఎంతమంది కొండ రెడ్డి కుటుంబాలకు కరెంటు మీటర్లు ఏర్పాటు చేసింది, ఎన్ని ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేసింది, ఎన్ని కరెంటు స్తంభాలు ఏర్పాటు చేసింది ఎన్ని కిలోమీటర్లు కరెంటు వైర్లు ఏర్పాటు చేసింది అదేవిధంగా ఇంకా ఎన్ని గ్రామాలలో కరెంట్ సౌకర్యం ఏర్పాటు చేయవలసి ఉన్నది ప్రతిపాదనలు తయారు చేసింది నివేదికలు సమర్పించాలని ఏపీ ఈపీ డి సి ఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ని ఆయన ఆదేశించారు, ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం ద్వారా, రోడ్లు భవనాల శాఖ ద్వారా, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ద్వారా తారు రోడ్లు, సీసీ రోడ్లు, మెటల్ రోడ్లు ఏర్పాటుకు సంబంధించిన నివేదికలు తయారుచేసి సమర్పించాలని సంబంధిత ఇంజనీర్లను ఆయన ఆదేశించారు, ఏజెన్సీలోని అన్ని ఆశ్రమ పాఠశాలలకు ఫైబర్ నెట్ సౌకర్యం ఏర్పాటు చేయుటకు అదేవిధంగా ఏడు మండలాలలోని సుమారు 300 గ్రామాలకు బిఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్టెల్ సెల్ఫోన్ నెట్ సౌకర్యం ఏర్పాటుకు సంబంధించిన అదేవిధంగా ఏర్పాటు చేసిన వాటి గ్రామాల నివేదికలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు, ఏజెన్సీలోని పక్కా భవనాలు లేని స్కూల్లు, త్రాగునీరు తదితర వాటిని గుర్తించి నివేదికల సమర్పించాలని ఏజెన్సీ డీఈవో ను ఆయన ఆదేశించారు, ఏజెన్సీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో బర్త్ వెయిటింగ్ హాలు,ప్రతి ఐదు కిలోమీటర్ల లోపు ప్రజలకు వైద్య సేవలు అందించే విధంగా విలేజ్ క్లినిక్ కొత్తవి

ఏర్పాటు చేయుటకు ప్రతిపాదన సమర్పించాలని ఎడియం& హెచ్ఓను ఆయన ఆదేశించారు, గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అదనపు తరగతిగదులు, తాగునీరు, మరుగుదొడ్లు తదితరవి కావలసి ఉన్న యెడల ప్రతిపాదనలు తయారుచేసి సమర్పించాలని డిడిని ఆయన ఆదేశించారు, ఏజెన్సీలోని జీసిసి డిఆర్ డిపోలకు పక్క భవనాలు, గోడౌన్లో అదేవిధంగా ప్రతినెల తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు సకాలంలో రేషన్ సరఫరా చేయుటకు ఏవేవి అవసరం ఉన్నది నివేదికలు తయారు చేసే సమర్పించాలని అదేవిధంగా ఒక్కొక్క డిఆర్ డిపో పరిధిలో ఎన్ని రేషన్ కార్డులు ఉన్నది జాబితా సమర్పించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు, ఏజెన్సీలోని ఎక్కడెక్కడ కమ్యూనిటీ భవనాలు, మ్యూజియంలు ఏర్పాటు చేయాలో పరిశీలించి నివేదికల సమర్పించాలని అదేవిధంగా ఏజెన్సీలోని అంగన్వాడి కేంద్రాలకు పక్కా భవనాలు లేనివాటిని గుర్తించి కొత్త భవనాలు ఏర్పాటు చేయుట, ఈ అంగన్వాడి కేంద్రాలలో త్రాగునీరు, మరుగుదొడ్లు లేని వాటిని పూర్తిస్థాయిలో పరిశీలించి నివేదికలు తయారు చేసే సమర్పించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు, పైన ఉదహరించిన వివిధ శాఖలకు సంబంధించిన ఐదు సంవత్సరాల యాక్షన్ ప్లాన్లు పూర్తిస్థాయిలో సర్వే చేసి నివేదికలు సమర్పించాలని వివిధ శాఖలకు సంబంధించిన అధికారులను ప్రాజెక్ట్ అధికారి ఆదేశించారు. సమావేశంలో ఏపీవో జనరల్ సిహెచ్ శ్రీనివాసరావు, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె. అబు సలాం, ఏడియం&హెచ్ఓ జి.ప్రకాశం, జీసిసి డివిజనల్ మేనేజర్ జి. పార్వతీశ్వరరావు, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, డివిజనల్ సివిల్ సప్లై అధికారి సి.శ్రీహరి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి. డేవిడ్ రాజ్, యండి. యూసఫ్, ఏ.రవికుమార్, సిడిపిఓ సంధ్యారాణి, డిప్యూటీ ఇంజనీర్లు సాయి సతీష్, రాజేంద్ర బాబు, శ్రీనివాసరావు, యస్ఓ టీ. మార్తమ్మ జిసిసి ఎస్ ఎం యం. నాగ వెంకట రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-రంపచోడవరం : ఓటు హక్కు కలిగిన ప్రతిపౌరుడు నిర్భయంగా ఓటర్లకు నచ్చిన అభ్యర్థులకు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఓటర్లకు వివిధ రూపాలలో అవగాహన కల్పించడం జరుగుతుందని రంపచోడవరం తాసిల్దార్ ఎ.కృష్ణజ్యోతి పేర్కొన్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ వారి కార్యాలయం నుండి ఓటర్లకు మహిళా సంఘాలతో రెవిన్యూ అధికారులతో సిబ్బందితో బిఎల్ఓలతో అవగాహన ర్యాలీని తహసిల్దార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రంపచోడవరం తాసిల్దార్ ఎ.కృష్ణ జ్యోతి మాట్లాడుతూ రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గానోరే వారి,రంపచోడవరం సబ్ కలెక్టర్, రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యస్.ప్రశాంత్‌కుమార్ వారి ఆధ్వర్యంలో త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలు 53 రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోగల రంపచోడవరం మండలంలోని ఓటు హక్కు ఉన్న ప్రతి పౌరుడు ఓటు హక్కు నిర్భయంగా ఉపయోగించుకునే విధంగా వివిధ రకాలలో ఓటర్లకు అవగాహన కల్పించడం జరుగుతుందని ఆమె అన్నారు. ఓటు హక్కు మన జన్మ హక్కు, మన రాష్ట్రాన్ని, మన దేశాన్ని ప్రగతి పదములు నడిపించే విధంగా మనకు నచ్చిన అభ్యర్థులకు ఓటు హక్కు వినియోగించుకుందాం, ఓటు హక్కు ఒక ఆయుధం అనే నినాదాలతో తహసిల్దార్ కార్యాలయం నుండి ప్రభుత్వ జూనియర్ కాలేజీ వరకు నినాదాలతో ఓటర్లకు అవగాహన కల్పిస్తూ ర్యాలీని నిర్వహించారు. అనంతరం జూనియర్ కాలేజీ ఎదురుగా ఓటుహక్కు వినియోగంపై ఓటు హక్కు నిర్భయంగా వినియోగించుకునే విధంగా ఓటర్లకు విభూది బ్రదర్స్ కళానాటకం (కల్చరల్ ప్రోగ్రాం) ద్వారా ఓటర్లకు అవగాహన కల్పించడం జరిగింది, ఈకార్యక్రమంలో ఐటీడీఏ పరిపాలన అధికారి డివిఎస్‌బి రమణ, ఎంపీడీవో హరికృష్ణ, రంపచోడవరం సబ్ ఇన్స్పెక్టర్ మోహనరావు, డిప్యూటీ తాసిల్దార్లు యస్‌వివి సత్యనారాయణ, బి.రాజు, సీనియర్ అసిస్టెంట్లు సూరమ్మ, ఇందిరాబాయ్, వీఆర్వోలు గణపతి, సిహెచ్. రవి, రమాదేవి, జి.ప్రభాకర్, జి.భూషణం, సత్యనారాయణ, రమాదేవి, పంచాయతీ కార్యదర్శి సిహెచ్. సుధాప్రకాష్ మహిళా సంఘాలు తదితరులు పాల్గొన్నారు,

శ్రీ అనంత వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాణప్రతిష్ట

విశాలాంధ్ర-అనంతగిరి : అనంతగిరి గంట్యాడ మండలాల సరిహద్దు గ్రామమైన ఎగువ కొండపర్తి గ్రామంలో శ్రీ అనంత వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాణప్రతిష్ట కార్యక్రమం బుధవారం వైభవంగా జరిగింది స్వామి స్వరూపానంద సరస్వతి ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆలయ ధర్మకర్త సముద్రారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం విగ్రహాలను గర్భగుడిలో ప్రతిష్టించారు ఈ వైభవాన్ని చూసేందుకు సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయం వద్దకు చేరుకున్నారు వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రాణప్రతిష్ట కార్యక్రమం వైభవంగా సాగింది ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు వచ్చిన భక్తులందరికీ అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించి స్వామివారి దర్శనం కల్పించారు నిత్యం భక్తుల కోసం ఆలయం తెరిచి ఉంటుందని ధర్మకర్త సముద్రారెడ్డి ఈ సందర్భంగా తెలిపారు.

మే 1 నుండి వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు

విశాలాంధ్ర-పాడేరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాలు, జిల్లా కలెక్టర్ వారి ఉత్తర్వులు మేరకు జిల్లాలో 50 ఉచిత వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు మే ఒకటవ తేది నుండి జిల్లా వ్యాప్తంగా నిర్వహించునున్నట్లు జిల్లా క్రీడాప్రాధి కారసంస్థ అధికారి ఏ .జగన్మోహనరావు ఒక ప్రకటన లో తెలిపారు. జిల్లాలోని అన్నిగ్రామీణ, మేజర పంచాయతీల, మండల, జిల్లా కేంద్రాలలో పలు క్రీడా0శాలు ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ శిక్షణ శిబిరాలు ఆయా ప్రాంతాలకు చెందిన క్రీడాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్లు, అంతర్జాతీయ, జాతీయ క్రీడాకారులు మరియు సీనియర్ క్రీడాకారుల నుండి జిల్లా క్రీడా ప్రాధికారసంస్థ దరఖాస్తులు ఆహ్వానిస్తుందని తెలిపారు. క్రీడా శిక్షణ ఇవ్వడానికి ఆసక్తి కలిగిన వారు ఈనెల ఐదవ తేదీలోగా దరఖాస్తులను పాడేరులో ఉన్న జిల్లా క్రీడా ప్రాధికారసంస్థ కార్యాలయానికి దరఖాస్తులు అందజేయ వలసిందిగా కోరారు. క్రీడా శిక్షణ శిబిరాల్లో పాల్గొనేందుకు 8నుంచి14 సంవత్సరాల లోపు వయసు కలిగిన బాలబాలికలుకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పూర్తి వివరముల కొరకు 9000274225 నెంబర్‌లో సంప్రదించాలన్నారు. ఆసక్తి కలిగిన వారు తమ దరఖాస్తులను క్రీడా ప్రాధికార సంస్థఅధికారి కార్యాలయానికి అందజేయవలసినదిగా జిల్లా క్రీడాప్రాధి కారసంస్థ అధికారి వివరించారు.

రంపచోడవరం కూటమి అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా ఐవివి ప్రసాద్

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం కూటమి అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ వి వి ప్రసాద్‌ను రంపచోడవరం డివిజన్లోని 11 మండలాల కూటమి అసెంబ్లీ కోఆర్డినేటర్ గా నియమించినారు ఈ సందర్భంగా రాష్ట్ర బిజెపి అధ్యక్షులు దగ్గుపాటి పురందేశ్వరి రాష్ట్ర ఓబిసి మోర్చా అధ్యక్షులు వంగర గోపి శ్రీనివాస్ జిల్లా అధ్యక్షులు కాకర్ల సుబ్రహ్మణ్యంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి టిడిపి జనసేన కూటమిలోని వివిధ మోర్చా లోని భాగంగా రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గంలో తనను నియమించడం జరిగిందని ఎటపాక కూనవరం చింతూరు వి ఆర్ పురం మండలాల్లోని ఓబీసీ నాయకులను కూటమి అభ్యర్థుల వారి సేవలను ఉపయోగించుకొని ముందుకు పోవాలని సూచించారు, కూటమి అభ్యర్థులైన మిరియాల శిరీష ఎమ్మెల్యే గా మన ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని మన నియోజకవర్గపు కష్టసుఖాలను నెరవేర్చుకోవాలని 11 మండలాల ప్రజలను కోరడమైనది ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన

విశాలాంధ్ర-దేవీపట్నం : మండలం, దేవారం గ్రామంలో జల జీవన్ మిషన్‌కు సంభందించి పోస్టర్ తొలగించక పోవటంపై సర్వత్రా విమర్శలు వెళు వెత్తున్నాయి. ఈసందర్భంగా భారత్ ఆదివాసి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తెల్లం శేఖర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు 2024 రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ ఆంక్షలు ఉన్నప్పటికీ అల్లూరి

సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం దేవీపట్నం మండలం దేవారం గ్రామంలో పంచాయతీ కార్యాలయం ముందు ఏర్పాటుచేసిన జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికి త్రాగునీరు అందించేందుకు బోర్డు 2021 సంవత్సరం లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కానీ నేటికీ ఒక్క చుక్క మంచి నీళ్ళు ఇవ్వలేదన్నారు.జల జీవన్ మిషన్ బోర్డుపై ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫోటో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఫోటోలు స్పష్టంగా రోడ్డు వెంబడి వెళ్లే ప్రయాణికులందరికీ, గ్రామ ప్రజలందరికీ బహిర్గతంగా కనిపిస్తున్నాయన్నారు. 2024 ఎన్నికల కోడ్ నిబంధన విరుద్ధంగా ఉన్న జలజీవన్ మిషన్ బోర్డుపై ముసుగుచేయాలని డిమాండ్ చేశారు. అలాగే నిబంధనలు పాటించని సంబంధిత అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఈసీ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

మితిమీరుతున్న మందుబాబుల ఆగడాలు

మద్యం సేవించి పంట పొలాలలో సీసాలు పగలగొట్టిన మందుబాబులు
ఇబ్బంది పడుతున్న రైతన్నలు

విశాలాంధ్ర-చింతపల్లి : మన్యంలో మందుబాబుల ఆగడాలు మితిమీరి పోతున్నాయి. పంట పొలాలే వారి మద్య సేవనానికి ఆవాసాలుగా తయారయ్యాయి. ఎక్కడ ఖాళీ కనిపిస్తే అక్కడే మద్యం సేవించి తాగిన కాళీ సీసాలను అక్కడే పగలగొట్టి ఆనందిస్తున్నారు. వ్యవసాయం చేసే సమయంలో రైతులు పంట పొలాలను దుక్కి దున్నే క్రమంలో గాజు పెంకులు గుచ్చుకుంటూ తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు, కొంతమంది రైతులకు గాయాలపాలైన సందర్భాలు లేకపోలేదు. మండలంలోని అంతర్ల గ్రామ సమీపాన వ్యవసాయ పంట పొలాలలో తాగుబోతులకు అడ్డగా మారాయి. మందుబాబులను నియంత్రించేవారు లేకపోవడంతో వారు చేసే ఆకతాయి చేష్టలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. మందుబాబులు మద్యం సేవించే సమయంలో ఎవరైనా వెళ్లి ఈ ప్రాంతంలో మద్యం సేవించరాదని అడిగితే మందుబాబులు వారిపై ఎదురుదాడికి దిగుతున్నారు. ఇటువంటి వారిని నియంత్రించడానికి కఠినమైన చట్టాలు రావాలని, ఇదే క్రమంలో మండలంలో విచ్చలవిడిగా ఉన్న బెల్టు మద్యం దుకాణాలపై ఎన్ఫోర్స్మెంట్ శాఖ ఉన్నత అధికారులు కొరడా జులిపించాలని ఈప్రాంత రైతులు, చుట్టుపక్కల ప్రజలు కోరుతున్నారు.